నీటితోనే పెను ముప్పు!

- నీటి కొరతతో ఆర్థిక వ్యవస్థ కుప్పకూలే ప్రమాదం
- తాగు, సాగు, పరిశ్రమలు, పట్టణీకరణపై కూడా తీవ్ర ప్రభావం.. ధరలూ పెరగొచ్చు
- బొగ్గు, స్టీల్, పవర్ గ్రిడ్లు మూతబడే అవకాశం
- దేశంలో నీటి కరువుపై ఇప్పటికే మూడీస్ అలర్ట్

(స్పెషల్ టాస్క్ బ్యూరో)

హైదరాబాద్, జూలై 4 (నమస్తే తెలంగాణ): రాజకీయ పరిణామాలు, పాలకులు తీసుకొనే విధానపరమైన నిర్ణయాలు, అప్పులు, చెల్లిస్తున్న వడ్డీలు.. ఇవన్నీ ఓ దేశ ఆర్థిక వ్యవస్థను ప్రభావితం చేస్తాయని ఇప్పటివరకూ తెలుసు. అయితే, నీటి సంక్షోభం కారణంగా దేశ ఆర్థిక వ్యవస్థే కుప్పకూలే ప్రమాదముంటుందని ఊహించగలమా? అయితే, ఇప్పుడు ప్రస్తుతం దేశంలో అదే పరిస్థితి దాపురించే సూచనలు కనిపిస్తున్నాయి. ప్రపంచంలోనే అత్యధిక జనాభా కలిగిన భారత్‌లో నీటి లభ్యత అంతకంతకూ పడిపోతున్నది. వాతావరణ మార్పులు, లోటు వర్షపాతం, పట్టణీకరణ, నీటి సంరక్షణలో ప్రభుత్వం ముందు జాగ్రత్త చర్యలు చేపట్టకపోవడం వెరసి దేశ వ్యాప్తంగా కరువు తాండవిస్తున్నది. ఇది ఇలాగే కొనసాగితే దేశ ఆర్థిక వ్యవస్థే చిన్నాభిన్నమయ్యే పరిస్థితి రావొచ్చని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

ఊహించనంత నష్టం

దేశంలోని దాదాపు 65 శాతం జనాభా వ్యవసాయం, దాని అనుబంధ రంగాల మీదనే ఆధారపడి జీవిస్తున్నది. దేశ జీడీపీలో సాగు రంగం వాటా 20 శాతానికి పైమాటే. వానలు, భూగర్భ జలాలు, నీటి వనరులపై ఆధారపడే వ్యవసాయరంగం పురోగతి సాగిస్తున్నది. అయితే, తీవ్రమైన వేడిగాలులు, రుతుపవనాల గమనంలో మార్పులు, ఎల్‌నినో ఎఫెక్ట్ వెరసి ఏటా వ్యవసాయానికి సరిపడినంత వర్షపాతం నమోదవ్వట్లేదు. నదులు, కాలువల్లోని నీరు తాగు అవసరాలకే చాలట్లేదు. ఇది నిత్యావసరాల ధరల పెరుగుదలకు కారణమవ్వడమే కాకుండా వ్యవసాయ కూలీల ఉపాధికి గండి పెట్టేదిగా మారింది. ఇక, దేశంలోని 15 ప్రధాన జీవ నదుల్లో 11 నదుల్లో నీటి మట్టాలు భారీగా తగ్గిపోయాయి. గంగ, సభర్మతీ, మహీ, తపీ, కావేరీ, పెన్నా, సబర్మతీపై నిర్మించిన పలు జలాశయాలు అడుగంటిపోయాయి. దీంతో తగినంత నీటి సరఫరా లేకపోవడంతో బొగ్గు, స్టీల్, విద్యుదుత్పత్తి కంపెనీలు మూతపడే ప్రమాదం పొంచి ఉన్నది. ఇది ఇలాగే కొనసాగితే.. తయారీ, సేవారంగాలు కోలుకోలేనంత దెబ్బతింటాయి. ఉపాధి కోల్పోయి కుటుంబాలు అప్పుల్లో కూరుకుపోతాయి. సామాజిక అశాంతి పెచ్చరిల్లే ప్రమాదం కూడా ఉన్నది. దేశంలో నెలకొన్న నీటి సంక్షోభంపై ప్రభుత్వం వెంటనే స్పందించి తగిన చర్యలు చేపట్టాలని సామాజిక కార్యకర్తలు డిమాండ్ చేస్తున్నారు. కాగా, నీటి కొరత భారత ఆర్థిక వ్యవస్థకు తీవ్ర నష్టం చేకూర్చే ప్రమాదం ఉన్నదని ఇటీవలే మూడీస్ రేటింగ్స్ హెచ్చరించిన విషయం తెలిసిందే.

కేసీఆర్ సర్కారు అలా.. మోదీ సర్కారు ఇలా..

సాగు, తాగు, పారిశ్రామిక అవసరాలకు తగినంత నీరు ఉంటేనే అభివృద్ధి సాధ్యమవుతుందని గ్రహించి 2014లో అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం 'మిషన్ కాకతీయ'తో చెరువులు, కుంటల్లో పూడికతీత కార్యక్రమాన్ని పెద్దయెత్తున చేపట్టింది. దీంతో భూగర్భ జలాలు పెరిగాయి. చెరువులు, కుంటలు, సరస్సులు నీటితో తొణికిసలాడి సాగు పండుగైంది. తెలంగాణ దేశానికే ధాన్యాగారమైంది. పారిశ్రామికాభివృద్ధి జరిగింది. ప్రజల ఆదాయమూ గణనీయంగా పెరిగింది. అయితే, 'మిషన్ కాకతీయ' స్ఫూర్తితో 2022లో ప్రధాని మోదీ చెరువుల పూడికతీత కార్యక్రమాన్ని ఆర్భాటంగా చేపట్టారు. దేశంలోని 785 జిల్లాల్లో ఒక్కో జిల్లా నుంచి కనీసం 75 సరస్సుల్లో పూడికతీత జరుగాలని ఆదేశించారు. అయితే, ప్రచారంలో చూపిన శ్రద్ధ కార్యాచరణలో జరుగలేదు. ఆ పనులు సవ్యంగా జరిగితే, ప్రస్తుత నీటి సంక్షోభం కొంతైనా తగ్గేదని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

మూడోసారి ముఖ్యమంత్రిగా..

- జార్ఖండ్ సీఎంగా హేమంత్ సారేన్ ప్రమాణం
- 5 నెలల జైలు జీవితం తర్వాత మళ్లీ పగ్గాలు

రాంచి, జూలై 4: జార్ఖండ్ ముఖ్యమంత్రిగా జార్ఖండ్ ముక్తి మోర్చా(జేఎంఎం) కార్య నిర్వాహక అధ్యక్షుడు హేమంత్ సోరేన్ గురువారం మూడోసారి ప్రమాణస్వీకారం చేశారు. రాజ్‌భవన్‌లో గవర్నర్ సీపీ రాధాకృష్ణన్ ఆయనతో ప్రమాణం చేయించారు. ఈ కార్యక్రమానికి తాజా మాజీ ముఖ్యమంత్రి చంపయీ సోరేన్, హేమంత్ తండ్రి, జేఎంఎం అధినేత శిబు సోరేన్, తల్లి రూపి సోరేన్, భార్య కల్పన సోరేన్, జేఎంఎం కూటమి నేతలు హాజరయ్యారు. ఐదు నెలల క్రితం మనీలాండరింగ్ కేసులో జైలుకు వెళ్లే ముందు జనవరి 31న హేమంత్ సోరేన్ ముఖ్యమంత్రి పదవికి రాజీనామా చేశారు. హేమంత్ తర్వాత చంపయీ సోరేన్ సీఎం పగ్గాలు చేపట్టి, తాజాగా రాజీనామా చేశారు. దీంతో హేమంత్ సోరేన్ మరోసారి సీఎంగా బాధ్యతలు తీసుకున్నారు.

పుదుచ్చేరి సంక్షోభంలో సంక్షోభం

మిత్రపక్షంపై బీజేపీ గరం

పుదుచ్చేరి, జూలై 4: కేంద్ర పాలిత ప్రాంతం పుదుచ్చేరిలో రాజకీయ సంక్షోభం ఏర్పడింది. అధికార ఏఐఎన్ఆర్‌సీ-బీజేపీ సంకీర్ణంలో విభేదాలు వీధికెక్కాయి. ముఖ్యమంత్రి రంగస్వామి పాలనలో అవినీతి పేరుకుపోయిందని, ప్రజావ్యతిరేక విధానాలు అధికమయ్యాయని ఆరోపిస్తూ బీజేపీ, కొందరు స్వతంత్ర ఎమ్మెల్యేలు మొత్తం ఏడుగురు బుధవారం ఢిల్లీలో పార్టీ చీఫ్ నడ్డాను కలిశారు. ఏకైక స్థానానికి ఇటీవల జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థి ఓటమికి రంగస్వామి అసమర్థ పాలనే కారణమని వారు ఆరోపించారు. ఈ బృందం సభ్యులు కేంద్ర మంత్రి, పుదుచ్చేరి పరిశీలకుడు అర్జున్ రామ్ మేఘ్వాల్, లెఫ్టినెంట్ గవర్నర్ సీపీ రాధాకృష్ణన్‌ను సైతం కలిశారు. 30 మంది సభ్యులున్న పుదుచ్చేరి అసెంబ్లీలో ఏఐఎన్ఆర్‌సీకి 10 మంది, బీజేపీకి ఆరుగురు, ఇండిపెండెంట్లు ఆరుగురు, డీఎంకే, కాంగ్రెస్‌కు 8,ముగ్గురు నామినేటెడ్ సభ్యులు ఉన్నారు.

ప్రమాణ స్వీకారంలో నినాదాలు చేయరాదు

కొత్త నిబంధనను చేర్చిన లోక్‌సభ స్పీకర్

న్యూఢిల్లీ, జూలై 4: ఎంపీల ప్రమాణ స్వీకార సమయంలో చోటుచేసుకున్న నినాదాలపై ఆగ్రహం వ్యక్తం చేసిన స్పీకర్ ఓం బిర్లా.. కొత్త నిబంధనను అమల్లోకి తీసుకొచ్చారు. నిర్దేశిత ప్రమాణం లేదా ధృవీకరణకు ఎంపీలు కచ్చితంగా కట్టుబడి ఉండేలా చట్టంలో కొత్త నిబంధనను చేర్చారు. జూన్ 28న నుంచి ఇది అమల్లోకి వచ్చింది. 'భారత రాజ్యాంగం 3వ షెడ్యూల్‌లో నిర్దేశించినదానికి అనుగుణంగా లోక్‌సభ సభ్యుడి ప్రమాణ స్వీకారం లేదా ధృవీకరణ ఉండాలి. ప్రమాణ స్వీకారం చేస్తుండగా సభ్యులు ఇతర పదాలు, నినాదాలు అందులో జోడించరాదు' అని పేర్కొనే కొత్త క్లాజ్‌ను చట్టంలో ప్రవేశపెట్టారు. తాజాగా సభ్యుల ప్రమాణ స్వీకార సమయంలో కొంతమంది జై సంవిధాన్, జై హిందూ రాష్ట్ర, జై పాలస్తీనా.. వంటి నినాదాలు చేశారు. దీంతో స్పీకర్ కొత్త నిబంధన తెచ్చారు.

వచ్చే రెండేండ్లలో 10 వేల నాన్-ఏసీ కోచ్‌లు: రైల్వే

న్యూఢిల్లీ, జూలై 4: రైల్వే ప్రయాణికులకు శుభవార్త! రైళ్లలో ప్రయాణికుల రద్దీని దృష్టిలో పెట్టుకొని భారతీయ రైల్వే, రాబోయే రెండేండ్లలో దాదాపు 10 వేల నాన్-ఏసీ రైల్వే కోచ్‌ల తయారీ చేపట్టబోతున్నది. ఇందుకు సంబంధించిన పనులకు ఆమోదముద్ర వేసినట్టు రైల్వే వర్గాలు గురువారం మీడియాకు వెల్లడించాయి. 2024-25, 2025-26 ఆర్థిక సంవత్సరాల్లో 9,929 నాన్-ఏసీ రైల్ కోచ్‌ల తయారీకి ఆమోదముద్ర వేశారు. ప్రస్తుతం ఆర్థిక సంవత్సరంలో 4,485, తదుపరి ఆర్థిక సంవత్సరంలో 5,444 రైల్వే కోచ్‌ల తయారీ ఉంటుందని రైల్వే అధికారులు తెలిపారు. మొత్తం కోచ్‌ల్లో జనరల్ బోగీల సంఖ్య మూడోవంతు ఉంటుందని తెలిసింది.

నీట్-యూజీ పరీక్షను రద్దు చేయొద్దు

సుప్రీంకోర్టులో 56 మంది ర్యాంకర్ల పిటిషన్

న్యూఢిల్లీ, జూలై 4: నీట్-యూజీ పరీక్షను రద్దు చేయవద్దంటూ 56 మంది ర్యాంకర్లు సుప్రీంకోర్టును ఆశ్రయించారు. ఈ పరీక్షను రద్దు చేయకుండా కేంద్ర ప్రభుత్వం, నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీలకు తగిన ఆదేశాలు జారీచేయాల్సిందిగా ఆ పిటిషన్‌లో కోరారు. 'పరీక్ష రద్దు అనేది నిజాయితీగా, కష్టపడి చదివిన విద్యార్థులను నష్టపరుస్తుంది. అంతేగాక వారి విద్యాహక్కు ఉల్లంఘనకు దారితీస్తుంది' అని గుజరాత్‌కు చెందిన సిద్ధార్థ్ కోమల్ సింగ్, మరో 55 మంది ర్యాంకర్లు పిటిషన్‌లో తెలిపారు. పరీక్ష నిర్వహణలో జరిగిన అక్రమాలపై దర్యాప్తు చేసేందుకు కేంద్ర విద్యాశాఖకు తగిన ఆదేశాలు జారీచేయాలని వారు కోరారు. పేపర్ లీక్ సహా ఇతర అక్రమాలకు పాల్పడ్డవారిపై కఠిన చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. నీట్-యూజీ పరీక్ష రద్దు కోరుతూ సుప్రీంకోర్టులో ఇప్పటికే 26 పిటిషన్లు దాఖలయ్యాయి. అత్యున్నత న్యాయస్థానం వీటిపై జూలై 8న విచారణ చేపడుతున్నది. మరోవైపు పరీక్షను రద్దు చేయవద్దంటూ 56 మంది ర్యాంకర్లు కోర్టు గడప తొక్కటం గమనార్హం.

కోటాలో మరో విద్యార్థి ఆత్మహత్య

ఈ ఏడాదిలో 13కు చేరిన మృతుల సంఖ్య

కోటా, జూలై 4: ఉద్యోగ, పోటీ పరీక్షల కేంద్రమైన రాజస్థాన్‌లోని కోటాలో మరో విద్యార్థి ఆత్మహత్య చేసుకున్నాడు. బీహార్‌కు చెందిన సందీప్ కుమార్ కుర్మి (16) గురువారం తాను ఉంటున్న పీజీ రూములో ఫ్యాన్‌కు ఉరేసుకుని బలనర్మణానికి పాల్పడ్డాడు. దీంతో కోటాలో జనవరి నుంచి ఆత్మహత్య చేసుకున్న విద్యార్థుల సంఖ్య 13కు చేరింది. కాగా, గత ఏడాది 26 మంది విద్యార్థులు ఉసురు తీసుకున్నారు. నలంద జిల్లాకు చెందిన సందీప్ గత రెండేళ్లుగా ఇక్కడి మహావీర్‌నగర్‌లో ఉంటూ జేఈఈకి శిక్షణ పొందుతున్నాడు. అతని సోదరుడు సంజిత్ కూడా కోటాలోనే వేరే ప్రాంతంలో ఉంటూ నీట్ పరీక్షకు సిద్ధమవుతున్నాడు. వీరిద్దరి తల్లిదండ్రులు నాలుగేండ్ల క్రితం మరణించగా, వారి అంకుల్ ఇద్దరినీ చదివిస్తున్నాడు. పీజీ రూముల్లో ఆత్మహత్యల నివారణకు తప్పనిసరిగా బిగించాల్సిన యాంటీ సూసైడ్ పరికరం సందీప్ ఆత్మహత్య చేసుకున్న రూమ్ ఫ్యాన్‌కు బిగించి లేదని పోలీసులు తెలిపారు.

కుర్తాళం పీఠాధిపతికి అస్వస్థత

యాంజియోప్లాస్టీ చేసిన వైద్యులు

చెన్నై, జూలై 4: తమిళనాడులోని తెన్‌కాశి జిల్లా కుర్తాళంలో ఉండే సిద్ధేశ్వరి పీఠాధిపతి సిద్ధేశ్వరానంద భారతీ మహాస్వామి (88) అస్వస్థతకు గురయ్యారు. ఛాతి నొప్పితో మంగళవారం ఆయనను చెన్నైలోని కావేరీ దవాఖానలో చేర్చారు. వెంటనే కరోనరీ యాంజియోగ్రఫీ నిర్వహించిన వైద్యులు ఎలక్టివ్ యాంజియోప్లాస్టీ చికిత్స చేశారు. ప్రస్తుతం ఆయన ఆరోగ్యం నిలకడగా ఉందని వైద్యులు తెలిపారు. కాగా, వైద్యుల పర్యవేక్షణలో ఉన్న సిద్ధేశ్వరానందను కలుసుకునేందుకు భక్తులు ఎవరూ రావొద్దని పీఠం నిర్వాహకులు కోరారు.

15 రోజుల్లో 10 వంతెనలు

బీహార్‌లో కూలిన మరో బ్రిడ్జి
సుప్రీంకోర్టులో పిల్

పాట్నా, జూలై 4: బీహార్‌లో కూలిన వంతెనల సంఖ్య 10కి చేరింది. గురువారం సరన్ జిల్లాలో గండకీ నదిపై నిర్మించిన చిన్న వంతెన కూలిపోయింది. ఈ ప్రమాదంలో ఎలాంటి ప్రాణ నష్టం జరగలేదు. 15 ఏండ్ల క్రితం ఈ వంతెనను నిర్మించారు. ఈ జిల్లాలో గత 24 గంటల్లో ఈ తరహా ఘటన ఇది మూడోదని జిల్లా మెజిస్ట్రేట్ అమన్ సమీర్ తెలిపారు. చిన్న వంతెనలు కూలిపోతుండటంపై ఉన్నత స్థాయి విచారణకు ఆదేశించినట్టు తెలిపారు. భారీ వర్షాల కారణంగా చిన్న వంతెనలు కూలిపోతూ ఉండొచ్చని స్థానికులు అభిప్రాయపడ్డారు. మరోవైపు వంతెనల నిర్మాణంపై ఆడిట్ నిర్వహించేలా బీహార్ ప్రభుత్వాన్ని ఆదేశించాలని బ్రజేశ్ అనే న్యాయవాది సుప్రీంకోర్టులో పిల్ దాఖలు చేశారు. దేశంలో ఎక్కువగా వరదలకు ప్రభావితమయ్యే రాష్ట్రం బీహారేనని తెలిపారు.

బ్రెయిన్ ఈటింగ్ అమీబాతో కేరళలో బాలుడు మృతి

ఆ రాష్ట్రంలో ఇది మూడో కేసు

తిరువనంతపురం: మెదడు తినే అమీబా సోకి కేరళలోని కోజికోడ్‌కు చెందిన 14 ఏండ్ల బాలుడు మృత్యువాత పడ్డాడు. అమీబిక్ మెనింగోఎన్సెఫాలిటిస్ (మెదడు తినే అమీబా) బ్యాక్టీరియా బారిన పడ్డ మృదుల్ (14) అనే బాలుడు గతకొద్ది రోజులుగా కోజికోడ్‌లోని ఓ ప్రైవేట్ దవాఖానలో చికిత్స తీసుకుంటూ, బుధవారం తుదిశ్వాస విడిచాడు. ఓ చెరువులో కొద్ది రోజుల క్రితం ఈతకు వెళ్లిన మృదుల్‌కు, అక్కడి నీటి ద్వారా అమీబా బ్యాక్టీరియా సోకి ఉండొచ్చని వైద్య వర్గాలు అంచనా వేశాయి. కేరళలో అమీబా సోకి వ్యక్తి మరణించటం ఈ ఏడాది మే తర్వాత ఇది మూడో కేసు. బ్రెయిన్ ఈటింగ్ అమీబా సాధారణంగా చెరువులు, సరస్సులు, నెమ్మదిగా కదులుతున్న నదుల్లో ఉంటాయి. చాలా అరుదుగా మానవ శరీరంలోకి ప్రవేశించి వివిధ అనారోగ్యాలకు కారణమవుతాయి.

పరీక్షలో విద్యార్థి ప్రదర్శనపై ఎగ్జామ్ హాల్ ప్రభావం

తాజా అధ్యయనంలో వెల్లడి

న్యూఢిల్లీ: పరీక్ష రాసే గదిలో సీలింగ్ ఎత్తు, ఉష్ణోగ్రత, గాలి నాణ్యత.. ఇవన్నీ ఆ గదిలో పరీక్ష రాస్తున్న విద్యార్థుల ప్రతిభను ప్రభావితం చేస్తున్నాయని తాజా అధ్యయనం ఒకటి తేల్చింది. సీలింగ్ ఎక్కువ ఎత్తులో ఉన్న గదిలో పరీక్ష రాసిన విద్యార్థులకు తక్కువ మార్కులు వచ్చినట్టు పరిశోధకులు గుర్తించారు. దక్షిణ ఆస్ట్రేలియా, డీకెన్ యూనివర్సిటీ పరిశోధకులు తాజా అధ్యయనం ప్రకారం, 'పరీక్షల్లో మీరు ఎలా రాణిస్తారన్నది సబ్జెక్ట్‌పై అవగాహన, ప్రిపరేషన్‌పై ఆధారపడి ఉంటుంది. చాలా కాలంగా అందరూ ఇదే వాస్తవమని నమ్ముతున్నారు. అయితే ఇది పూర్తి నిజం కాదు' అని అధ్యయనం పేర్కొన్నది. ఆస్ట్రేలియా యూనివర్సిటీకి చెందిన 15,400 మంది గ్రాడ్యుయేట్ విద్యార్థుల ఫలితాల్ని (2011-2019 మధ్య) పరిశోధకులు విశ్లేషించి పై నివేదికను తయారుచేశారు. పరీక్ష గది సీలింగ్ ఎత్తుకు..అందులో పరీక్ష రాసిన విద్యార్థుల మార్కులకు ఉన్న సంబంధాన్ని పరిశీలించారు. సీలింగ్ ఎత్తు ఎక్కువగా ఉన్న గదుల్లో విద్యార్థులకు తక్కువ మార్కులు వచ్చినట్టు వారి పరిశీలనలో తేలింది.

పోక్సో కేసులో యెడియూరప్పకు కోర్టు సమన్లు

బెంగళూరు: కర్ణాటక మాజీ ముఖ్య మంత్రి, బీజేపీ నేత బీఎస్ యెడియూరప్పకు బెంగళూరు కోర్టు సమన్లు జారీ చేసింది. ఆయనపై పోక్సో చట్టం కింద నమోదైన కేసులో ఈ నెల 15న జరిగే విచారణకు హాజరుకావాలని ఆయనను ఆదేశించింది. బాధిత మైనర్ బాలిక (17), ఆమె తల్లి మౌనంగా ఉండటం కోసం వారికి యెడియూరప్ప, మరో ముగ్గురు నిందితులు సొమ్ము చెల్లించారని సీఐడీ ఆరోపించింది.

డేటింగ్ చేయడం నేరమా?

టీనేజర్ల అరెస్టుపై ఉత్తరాఖండ్ సర్కారుకు కోర్టు ప్రశ్న

న్యూఢిల్లీ: మైనర్ బాలికలతో డేటింగ్ చేసే మైనర్ బాలురను అరెస్ట్ చేయడం న్యాయమేనా? మైనర్ బాలికల తల్లిదండ్రులు ఆ బాలురపై ఫిర్యాదు చేయాలా? ఇటువంటి కేసుల్లో అరెస్టులను నివారించగలమా? అని ఉత్తరాఖండ్ హైకోర్టు ఆ రాష్ట్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించింది. డేటింగ్ చేసే బాలురను అరెస్టు చేయడం కన్నా, వారికి సలహా ఇవ్వడానికి పిలవవచ్చునని వ్యాఖ్యానించింది. ఓ ప్రజా ప్రయోజన వ్యాజ్యంపై విచారణ సందర్భంగా హైకోర్టు ఈ విధంగా స్పందించింది. ఇటువంటి కేసుల్లో కేవలం బాలురను మాత్రమే దోషులుగా పరిగణిస్తూ, శిక్షిస్తున్నారని పిటిషనర్ ఆవేదన వ్యక్తం చేశారు.

సవాలు విసిరి.. రాజీనామా చేసి

జైపూర్: రాజస్థాన్ బీజేపీ మంత్రి కిరోడిలాల్ మీనా తన పదవికి రాజీనామా చేశారు. ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల సందర్భంగా తాను బాధ్యత వహించే ఏడు నియోజకవర్గాల్లో ఏ ఒక్కదాంట్లో బీజేపీ ఓడినా మంత్రి పదవికి రాజీనామా చేస్తానని సవాలు విసిరారు. ఫలితాలు ఆయనకు వ్యతిరేకంగా వచ్చాయి. ఆయన సొంత నియోజకవర్గం దౌసా సహా నాలుగు స్థానాల్లో బీజేపీ ఓటమి పాలైంది. దీంతో తాను విసిరిన సవాల్ మేరకు పదవికి రాజీనామా చేశారు.

గవర్నర్ కోర్టులకు అతీతుడా?

- పదవిలో ఉంటే ఏం చేసినా చెల్లుతుందా?
- అయితే, నాకు న్యాయం జరిగేదెన్నడు?
- లైంగిక వేధింపుల కేసులో బెంగాల్ గవర్నర్ సీవీ ఆనంద్ బోస్‌పై సుప్రీంకు బాధితురాలు
- రాజ్యాంగాన్ని సవాల్ చేస్తూ పిటిషన్ దాఖలు

ఆనంద బోస్

(స్పెషల్ టాస్క్ బ్యూరో)

హైదరాబాద్, జూలై 4 (నమస్తే తెలంగాణ): పశ్చిమ బెంగాల్ గవర్నర్ సీవీ ఆనంద బోస్‌పై లైంగిక వేధింపుల ఆరోపణలు చేసిన రాజ్‌భవన్ ఉద్యోగిని సుప్రీంకోర్టులో సంచలన పిటిషన్ దాఖలు చేశారు. రాజ్యాంగంలో గవర్నర్లకు రక్షణ కల్పించడం వల్లే తనకు అన్యాయం జరిగినట్టు ఆమె వాపోయారు. గవర్నర్ విధుల్లో లైంగిక వేధింపులు కూడా ఉన్నాయా? అని ఆమె ప్రశ్నించారు. ఈ మేరకు గవర్నర్ పదవిలో ఉన్నవారికి రక్షణ కల్పిస్తున్న ఆర్టికల్ 361(2)ను ఆమె పిటిషన్‌లో సవాల్ చేశారు. తనకు తగిన న్యాయం జరుగడానికి ఈ విషయంలో సుప్రీంకోర్టు ప్రత్యేక మార్గదర్శకాలు ఇవ్వాల్సిందిగా పిటిషనర్ అభ్యర్థించారు.

పిటిషన్‌లో బాధితురాలు ఏమన్నారంటే?

'గవర్నర్ పదవిలో ఉంటే లైంగిక వేధింపులు చేయడానికి అనుమతి ఉన్నట్టేనా? రాజ్యాంగంలోని ఆర్టికల్ 361 (2) ఇలాంటివారిని రక్షించడానికే ఉన్నదా? ఒకవేళ, అదే నిజమైతే, ఆయన గవర్నర్ బాధ్యతల నుంచి దిగిపోయేవరకూ నాకు న్యాయం జరుగబోదు. దానికోసం ఎంతకాలం నేను వేచిచూడాలి?' అంటూ బాధిత మహిళ తన పిటిషన్‌లో ఆవేదన వ్యక్తం చేశారు. కాగా, శాశ్వత ఉద్యోగం ఇప్పిస్తానని తనకు ఆశబెట్టి ఏప్రిల్ 24, మే 2న గవర్నర్ రాజ్‌భవన్‌లో తనపై లైంగిక వేధింపులకు పాల్పడ్డాడని బాధితురాలు ఆరోపించారు. గవర్నర్‌పై ఎఫ్ఐఆర్ నమోదుకు కలకత్తా హైకోర్టు అడ్డుచెప్పడంతో, బాధితురాలు సుప్రీంకోర్టును ఆశ్రయించారు.

ఆర్టికల్ 361 (2)లో ఏమున్నది?

రాష్ట్రపతికి, గవర్నర్‌కు వ్యతిరేకంగా అతని/ఆమె పదవీకాలంలో ఉన్నప్పుడు ఎటువంటి సివిల్, క్రిమినల్ ప్రొసీడింగ్స్‌ను అనుమతించకుండా రాజ్యాంగంలోని 361 (2) అధికరణం రక్షణ కల్పిస్తున్నది. దీనిపై కోర్టుల్లోనూ విచారణ జరుపడానికి వీల్లేదు.

గవర్నర్ చేతిలోనే అంతా ఉండదు

- అసెంబ్లీ నిర్వహణపై బెంగాల్ స్పీకర్ వ్యాఖ్య
- ఇద్దరు టీఎంసీ ఎమ్మెల్యేల ప్రమాణంపై ప్రతిష్ఠంభన
- ప్రత్యేక అసెంబ్లీ సమావేశాన్ని ఏర్పాటు చేసిన స్పీకర్

బిమన్ బెనర్జీ

కోల్‌కతా: శాసనసభ నిర్వహణ పూర్తిగా గవర్నర్‌పై ఆధారపడి ఉండదని పశ్చిమ బెంగాల్ అసెంబ్లీ స్పీకర్ బిమన్ బెనర్జీ వ్యాఖ్యానించారు. శుక్రవారం నుంచి శాసనసభ ప్రత్యేక సమావేశాన్ని నిర్వహిస్తున్నట్టు ప్రకటిస్తూ గురువారం ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. 'అసెంబ్లీ నిస్సహాయంగా ఉండదు. ప్రతీది గవర్నర్ చేతుల్లో ఉండదు. రాజ్యాంగ నిబంధనలు ఉంటాయి. వాటిని అందరూ పాటించాల్సిందే' అని ఆయన గవర్నర్‌ను ఉద్దేశించి వ్యాఖ్యానించారు. ఉప ఎన్నికల్లో గెలిచిన ఇద్దరు తృణమూల్ ఎమ్మెల్యేల ప్రమాణస్వీకారంపై ప్రతిష్టంభన నేపథ్యంలో స్పీకర్ ఈ వ్యాఖ్యలు చేశారు.

అసెంబ్లీలోనే ప్రమాణస్వీకారం చేస్తాం: ఎమ్మెల్యేలు

ఇటీవలి ఉప ఎన్నికల్లో సయంతిక బందోపాధ్యాయ్, రయత్ హుస్సేన్ సర్కార్ విజయం సాధించారు. ఫలితాలు వచ్చి నెల రోజులు అవుతున్నా వీరి ప్రమాణస్వీకారం మాత్రం జరగలేదు. రాజ్‌భవన్‌లో ప్రమాణస్వీకారానికి రావాల్సిందిగా గత వారం వీరిద్దరిని గవర్నర్ ఆనందబోస్ ఆహ్వానించారు. అయితే తాము అసెంబ్లీలోనే ప్రమాణం చేస్తామని వారు పట్టుబడుతున్నారు. అసెంబ్లీ ప్రాంగణంలో ఆరు రోజులుగా నిరసన దీక్ష చేస్తున్నారు. ఈ వివాదం కొనసాగుతుండగా అసెంబ్లీ ప్రత్యేక సమావేశాన్ని స్పీకర్ ప్రకటించారు. అసెంబ్లీ నిర్వహణ పూర్తిగా గవర్నర్‌పై ఆధారపడి ఉండదని స్పష్టం చేశారు. తనకు సంబంధం లేకుండా అసెంబ్లీ సమావేశాల నిర్వహణపై గవర్నర్ ఎలా స్పందిస్తారనేది చూడాల్సి ఉంది.

వెయిట్ లాస్ మందులతో కంటిచూపు పోయే ప్రమాదం!

న్యూఢిల్లీ: ఒబెసిటీ, డయాబెటిస్ బాధితులకు ఇచ్చే పలు ఔషధాల వల్ల అరుదైన కంటి సమస్య వచ్చే ముప్పు ఉందని వెల్లడైంది. అమెరికాలోని మసాచుసెట్స్ ఐ అండ్ ఇయర్ హాస్పిటల్ పరిశోధకుల బృందం చేసిన ఈ అధ్యయనం వివరాలు అమెరికన్ మెడికల్ అసోసియేషన్ ఆప్తమాలజీ జర్నల్‌లో ప్రచురితమయ్యాయి. మధుమేహం ఉన్న వారికి ఇన్సులిన్ ఉత్పత్తిని పెంచి షుగర్ లెవల్స్ అదుపులో ఉండటానికి ఉపయోగపడేందుకు, ఊబకాయంతో బాధపడుతున్న వారికి బరువు తగ్గేందుకు గానూ ఒజెంపిక్, విగోవి వంటి ఔషధాలను వైద్యులు సిఫార్సు చేస్తున్నారు. సెమాగ్లుటైడ్ అనే ప్రొటీన్ ఉన్న ఈ మందులు వాడే ఊబకాయ బాధితులకు మిగతా వారి కంటే 'నాన్-ఆర్టెరిటిక్ అంటీరియర్ ఇషెమిక్ ఆప్టిక్ న్యూరోపతి' సమస్య వచ్చే అవకాశం ఏడు రెట్లు ఎక్కువ ఉందని పరిశోధకులు గుర్తించారు. మధుమేహ బాధితులకు ఈ ముప్పు నాలుగు రెట్లు ఎక్కువ ఉంటుందని పేర్కొన్నారు. ఈ సమస్య వల్ల హఠాత్తుగా ఒక కన్ను చూపు కోల్పోయే ప్రమాదం ఉంటుందని తెలిపారు.

అధిక కొలెస్ట్రాల్.. సైలెంట్ కిల్లర్

కంట్రోల్ చేసుకోకపోతే ముప్పు తప్పదు • మొదటిసారి భారత్‌లో మార్గదర్శకాలు

న్యూఢిల్లీ, జూలై 4: దేశంలో అధిక కొలెస్ట్రాల్(డైస్లిపిడెమియా) ప్రాణాంతకంగా మారుతున్నదని, గుండెజబ్బులకు కారణమవుతున్నదని వైద్య నిపుణులు తరచూ చెప్తుంటారు. అయితే, కొలెస్ట్రాల్ స్థాయిలకు సంబంధించి మాత్రం ఇప్పటివరకు భారత్‌లో నిర్దిష్టమైన మార్గదర్శకాలు లేవు. 2019లో యూరోపియన్ సొసైటీ ఆఫ్ కార్డియాలజీ ఇచ్చిన మార్గదర్శకాలనే భారత్‌లోనూ వైద్యులు పాటిస్తున్నారు. ఈ నేపథ్యంలో గురువారం భారత్‌లో మొదటిసారిగా 22 మంది సభ్యులతో కూడిన కార్డియలాజికల్ సొసైటీ ఆఫ్ ఇండియా(సీఎస్ఐ) కొలెస్ట్రాల్ స్థాయిల నిర్వహణకు సంబంధించి మార్గదర్శకాలను జారీ చేసింది.

అధిక కొలెస్ట్రాల్‌తో ముప్పు

రక్తంలో చెడు కొలెస్ట్రాల్(ఎల్‌డీఎల్), ట్రైగ్లిజెరైడ్స్ స్థాయిలు ఎక్కువ ఉండటం, మంచి కొలెస్ట్రాల్(హెచ్‌డీఎల్) తక్కువగా ఉండటం వల్ల గుండెజబ్బులు, స్ట్రోక్‌తో పాటు ఇతర అనారోగ్య సమస్యల ముప్పు ఉంటుంది. డైస్లిపెడెమియా ఎలాంటి లక్షణాలు లేకుండా గుండెజబ్బులకు కారణమయ్యే 'సైలెంట్ కిల్లర్' అని వైద్య నిపుణులు చెప్తుంటారు. చెక్కెర, కార్బోహైడ్రేట్స్ ఎక్కువగా ఉన్న ఆహారాలను తినడం వల్ల ఈ సమస్య ఎక్కువగా వస్తుంది. సమతుల ఆహారం, వ్యాయామం, ఔషధాల ద్వారా కొలెస్ట్రాల్ స్థాయిలను అదుపులో ఉంచుకోవచ్చు.

భారతీయుల కొలెస్ట్రాల్‌పై అధ్యయనం

కేరళ ఉత్తరాది రాష్ట్రాల్ల